క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ

కూసుమంచి: కూసుమంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన వైద్యాధికారిగా ఈరగాని సాయికుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కిషోర్‌కుమార్ వైరాకు బదిలీ కాగా ఆయన స్థానంలో చింతకాని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సాయికుమార్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా, పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్, సిబ్బంది మధ్య జరుగుతున్న వివాదాలు ఇటీవల కలెక్టర్ దృష్టికి వెళ్లగా.. బదిలీ చేసినట్లు సమాచారం.

'ఉపాధి' కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు..

నేలకొండపల్లి: ఉపాధి హామీ పథకం కూలీలకు మంగళవారం అనంతనగర్‌లో ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు పలు రకాల మందులు అందించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు తిగుళ్ల భాస్కర్‌లు మాట్లాడుతూ.. ఎండ తీవ్రతకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, పథకం మేట్లు సీతారామిరెడ్డి, వెంకటరెడ్డి, బాలస్వామి, మాధవి, యశోధ, తదితరులు పాల్గొన్నారు.

కూలీకి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి గ్రామానికి చెందిన కోలా లక్ష్మి రోజు మాదిరిగానే మంగళవారం ఉపాధి హామీ పనుల కోసం వెళ్లింది. ఈక్రమంలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కాల్వలో పడి కాలుకు తీవ్రగాయమైంది. కనీసం ప్రథమ చికిత్స కిట్లు లేకపోవడంతో సహచర కూలీలు ప్రత్యేక ఆటోలో ఖమ్మంకు తరలించారు.

మరమ్మతులు షురూ..



డైట్ కళాశాలలో పూర్తయిన స్లాబ్ మరమ్మతు పనులు

రూ.50లక్షలతో కళాశాలకు పూర్వవైభవం

- ఇప్పటికే స్లాబ్ మరమ్మతులు, వైరింగ్ పనులు పూర్తి
- రెండు నెలల్లో పూర్తయ్యేలా కార్యాచరణ
- వచ్చే విద్యా సంవత్సరానికి ముస్తాబు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని టేకులపల్లిలో ఉన్న డైట్ కళాశాల చాలా ఏళ్ల క్రితం నిర్మించారు. కాలక్రమేణా కళాశాల మరమ్మతులకు గురి కావడంతో కళాశాల నుంచి మరమ్మతుల చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీంతో నూతన కళాశాల భవన నిర్మాణ సమయాన మరమ్మతుల కోసం రూ.50 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో పూర్వ వైభవం తీసుకురానున్నారు.

పెరుగుతున్న అడ్మిషన్లు..

కళాశాలలో రెండేళ్లకు కలిపి మొత్తం 200మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 112 మంది ఉన్నారు. ఇందులో మొదటి సంవత్సరం నుంచి 88 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 24మంది విద్యార్థులు ఉన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులను భర్తీ చేస్తున్న క్రమంలో విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులు బోధిస్తున్న డైట్‌లో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ క్రమంలో సుమారు పదేళ్ల తర్వాత ప్రవేశాలు భారీగా పెరిగాయి. ప్రభుత్వం సైతం డైట్ కళాశాలలను బలోపేతం చేస్తున్న నేపథ్యాన కళాశాల నిర్మాణంతో పాటు కళాశాలకు పూర్వవైభవానికి మరమ్మతులు జరుగుతున్నాయి.

పనులు జరుగుతున్నాయి..



రాష్ట్ర ప్రభుత్వం కళాశాల మరమ్మతుల కోసం రూ.50లక్షలు మంజూరు చేసింది. ఈ క్రమంలో అందుకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే విద్యుత్ వైరింగ్, స్లాబ్ మరమ్మతు పనులు పూర్తి కాగా.. మిగతా పనులు జరుగుతున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి సుందరంగా ఉండనుంది.

– సామినేని సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్

రెండు నెలల్లో పూర్తయ్యేలా..

డైట్ కళాశాలలో మొత్తం 32 గదుల వరకు ఉన్నాయి. అక్కడక్కడ స్లాబ్ కురుస్తుంటుంది. ఈక్రమంలో స్లాబ్‌పై ఓ లేయర్ (పార) వేస్తూ పనులు పూర్తి చేశారు. అలాగే విద్యుత్ వైరింగ్ చేయడంతో పాటు కళాశాల ప్రిన్సిపాల్, ఆఫీస్ రూమ్, కంప్యూటర్ రూమ్‌ల్లో సీలింగ్ పూర్తి చేశారు కాని వాల్‌కేర్ పెట్టాల్సి ఉంది. ఇప్పటి వరకు వైరింగ్ పూర్తి కాగా, స్విచ్ బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. పేయింటింగ్, పనులు పెండింగ్‌లో ఉన్నారు. సుమారు రెండు నెలల్లో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.



పూర్తయిన వైరింగ్ పనులు

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రజలపై భారాలు మోపుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల సేవలో తరిస్తుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆరోపించారు. మోదీ పేద, మధ్య తరగతి ప్రజలను విస్మరించి పాలన చేస్తున్నారని ప్రజల జీవన స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యాన ఖమ్మం బైపాస్ రోడ్డులో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. తొలుత సీపీఐ కార్యాలయం నుంచి ప్రదర్శనగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రభుత్వ వైఖరి కారణంగా గడిచిన నాలుగేళ్లలో ప్రజల కొనుగోలు శక్తి సన్నగిల్లిందని, ఈ సమయాన ధరలు ఎలా పెంచుతారని ప్రశ్నించారు. పెరిగిన ధరలను ఉపసంహరించుకోకపోతే ప్రభుత్వానికి పతనం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, సీహెచ్.సీతామహాలక్ష్మి, మిడికంటి వెంకటరెడ్డి, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు తాటి నిర్మల, యానాలి సాంబశివరెడ్డి, ఇటికాల రామకృష్ణ, మద్దోజు శ్రావణ్, సైదా, జ్వాలా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నేతలు

పెంచిన ధరలు తగ్గించాలి..

కామేపల్లి: పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శివర్గ సభ్యుడు తేలే రాకేశ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం కొత్తలింగాల క్రాస్‌రోడ్డులో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓ పక్క మత విద్వేషాలను రెచ్చగొడుతూ మతసామరస్యాన్ని దిబ్బతీస్తూనే మరోపక్క కార్మికుల హక్కులను హరిస్తూ కార్పొరేట్ వర్గానికి సంపదను దోచిపెడుతున్నారని మండిపట్టారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా రాజు, రామారావు, రాము, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్ ఐఐటీ విజేతలకు మెమెంటోలు



మెమెంటోలు అందిస్తున్న యాజమాన్యం

ఖమ్మంసహకారనగర్: నగరంలోని గాంధీచౌక్ భక్త పోతన వీధిలో ఉన్న వండర్ కిడ్స్ హైస్కూల్‌లో ఇటీవల జరిగిన సైన్స్ ఎక్స్‌పో ఒలంపియాడ్ ఐఐటీలో గెలుపొందిన విద్యార్థులకు కరస్పాండెంట్ కె.శ్రీధర్‌రెడ్డితో కలిసి కార్పొరేటర్ తోట గోవిందమ్మ రామారావులు షీల్డ్, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసింహరెడ్డి, పూర్ణబిందు, జానిమియా, చామకూరి రమేష్, ఝాన్సీరెడ్డి, జానిమియా తదితరులు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య' విద్యార్థులకు బహుమతులు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో యాజమాన్యం

ఖమ్మంసహకారనగర్: ఐఎన్‌టీఎస్ఓ (ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్) జాతీయ పరీక్ష ఫైనల్ ఫలితాల్లో సత్తా చాటిన మమత ఆస్పత్రి రోడ్డులోని శ్రీచైతన్య విద్యార్థులకు మంగళవారం బహుమతులు అందజేశారు. వీరిలో బి.వర్షిత్, అక్షరశ్రీ, లోహిత్, సోహన్ గణేష్‌లకు ల్యాప్‌ట్యాప్‌లు, ఆశ్రిత్, గోకుల్ శ్రీనాథ్, కౌశిక్ రెడ్డి, అక్షిత్, శ్రీహర్షిత ట్యాబ్‌లు, గోల్డ్‌మెడల్స్, సామి సాహస్ర, ఈశాన్, గౌతమ్, ఓంసాయి వర్షిత్ స్మార్ట్ వాచ్, గోల్డ్‌మెడల్స్ సొంతం చేసుకున్నారు. కన్సోలేషన్ బహుమతి విభాగంలో 140 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య అభినందించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం చేతన్ మాథుర్, కో ఆర్డినేటర్ కృష్ణారావు, ప్రిన్సిపాళ్లు టీఎల్ఎస్ శర్మ, నాగప్రవీణ, నీరజ, వైస్ ప్రిన్సిపాళ్లు రామకృష్ణారెడ్డి, సురేష్, ఐపీఎల్ ఇన్‌చార్జ్ రాజశేఖరరెడ్డి, డీన్ కేవీఆర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ విజయవంతం



ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఐటీడీఏ అధికారులు

కామేపల్లి: ఐటీడీఏ ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ విజయవంతమైంది. మండలంలోని టేకులతండా జీపీఎస్ పాఠశాలలో 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఉద్దీపకం జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌ను ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి పర్యవేక్షించాక ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా ప్రతాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ జయరుద్దీన్, ఏసీఎంఓ రాములు, హెచ్ఎం రాజేశ్వరి, రాజానాయక్, సపావట్ కిషన్‌నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం..

- కాంపాక్టర్ వాహనం ప్రారంభం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థకు చెందిన కంపాక్టర్ వాహనాన్ని మేయర్ పునుకొల్లు నీరజ మంగళవారం ప్రారంభించారు. నగరంలో కేఎంసీకి సంబంధించిన స్వచ్ఛ ఆటోల ద్వారా సేకరిస్తున్న వ్యర్థాలను కొత్త బస్టాండ్‌వద్ద ఉన్న ఖాళీ స్థలంలో నిలిపిన కంపాక్టర్ వాహనంలో నింపి డంపింగ్‌యార్డ్‌కు తరలించేలా వాహనాన్ని సిద్ధం చేసినట్లు మేయర్ పేర్కొన్నారు. ఆటోలు డంపింగ్ యార్డ్ వరకు వెళ్తుండడంతో ఎక్కువ ఇంధనం ఖర్చు అవుతుందని, త్వరగా మరమ్మతులకు గురవుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బుర్రి వెంకటేశ్వర్లు, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

- డివిజన్‌లో కమిషనర్ పర్యటన



డ్రెయినేజీని పరిశీలిస్తున్న కమిషనర్ అగస్త్య

నగరంలోని 43వ డివిజన్‌లో కమిషనర్ అభిషేక్ అగస్త్య పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. డివిజన్‌లో రోడ్లపైకి వచ్చిన ర్యాంపులు, ఇతర ఆక్రమణలను తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం కాల్వొడ్డులోని వైకుంఠధామాన్ని సందర్శించి గ్యాస్ దహన వేదిక మరమ్మతులను పరిశీలించాక సిబ్బందికి పలు సూచనలు చేశారు.

- పన్నుల వసూళ్ల పరిశీలన

నగరంలో ఏర్లీ బర్డ్ కింద చేపట్టిన ఆస్తి పన్నుల వసూళ్లను కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. కమర్షియల్ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 30వ తేదీ లోపు ఆస్తి పన్ను మొత్తం చెల్లించిన వారికి 5 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు.

వినతుల వెల్లువ..

- ఎంపీకి బంజారా నాయకులు



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిని ఆలిండియా బంజారా సేవా సంఘం నాయకులు మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం జిల్లా కేంద్రంలో బంజారా భవన్ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ధరావత్ రామ్మూర్తినాయక్, భీముడు, చంద్రం, తారాభాయ్, అశోక్, పంతులు, బాబునాయక్, శ్యాం, పాపానాయక్ తదితరులు పాల్గొన్నారు.

- గంగ పుత్రుల సమస్యలపై..

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రభుత్వ పరంగా గంగపుత్రులను ఆదుకోవాలని జిల్లా గంగపుత్ర సంఘం అధ్యక్షుడు కన్నం ప్రసన్నకృష్ణ ఆధ్వర్యాన జిల్లా నాయకులు మంగళవారం హైదరాబాద్‌లోని మత్స్య భవన్‌లో తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను కోరారు. వినతి అందించిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి, జిల్లా అధ్యక్షుడు కన్నం ప్రసన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి దేశబోయిన మంగారావు, కోశాధికారి పెద్దపల్లి సుధాకర్, నాయకులు ఉపేందర్, తిరుపతయ్య, శంకర్, వెంకయ్య, నాగేశ్వరరావు, వేణు, సురేష్, సుధాకర్, రాజేందర్, నరేందర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

- కోతుల బెడదపై తహసీల్దార్‌కు..

తిరుమలాయపాలెం: కోతుల బెడద నుంచి కాపాడాలని మంగళవారం మండలంలోని హస్నాబాద్ గ్రామస్తులు తహసీల్దార్ సుధీర్‌కు వినతిపత్రం అందజేశారు. న్యూడెమోక్రసీ మండల నాయకులు మాగి వెంకన్న, గ్రామ కమిటీ కార్యదర్శి పాలవాయి నాగయ్య, మాగి లక్ష్మయ్య, రాచకొండ సాయిబాబు, మాగి రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలు..

- విద్యుత్ శాఖ అభివృద్ధి పనులు..



ఏదులాపురం ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఖమ్మంరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్‌శాఖ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి మంగళవారం పర్యటించి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎంవెంకటాయపాలెం సబ్‌స్టేషన్‌లక్ష సుమారు రూ.5లక్షల విలువైన బ్రేకర్‌ను స్విచాన్ చేసి ప్రారంభించారు. అలాగే ఏదులాపురంలో రూ.5లక్షల వ్యయంతో 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, సత్యనారాయణపురంలో 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మంరూరల్ డీఈ నాగేశ్వరరావు, ఏడీఈ రామకృష్ణ, ఏఈ ప్రభాకర్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- పవర్‌హౌజ్ కాలువ కట్ట పనులు..

కూసుమంచి: పాలేరు మినీ హైడల్ (విద్యుదుత్పత్తి కేంద్రం)కు రిజర్వాయర్ నుంచి నీటిని సరఫరా చేసే కాలువ కట్ట పటిష్ట పనులను అధికారులు మంగళవారం ప్రారంభించారు. ఇటీవల వచ్చిన భారీ వరదలకు ప్రాజెక్టుకు నీటిని సరఫరా చేసే కాలువ కట్టలు తెగిపోగా.. ఇరిగేషన్ అధికారులు గండ్లను పూడ్చి తాత్కాలికంగా పటిష్టపరిచారు. కాగా, జెన్‌కో ఆధ్వర్యాన ఈ ప్రాజెక్టుకు నిధులు మంజూరుకావడంతో పనులను చేపట్టారు.

- నేలకొండపల్లిలో ధాన్యం కొనుగోళ్లు..

నేలకొండపల్లి: నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో మంగళవారం కాంటాలు ప్రారంభించినట్లు కేంద్రం ఇన్‌చార్జ్ నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు ప్రతినిధులు అయోధ్య, గురవయ్య, గురుస్వామి, చిత్తరాములు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

21 జీఓను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్ అధ్యాపకులు

ఖమ్మంసహకారనగర్ : అధ్యాపక పోస్టుల భర్తీకి ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 21ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక కాకతీయ యూనివర్సిటీ పీజీ, వ్యాయామ కళాశాలల కాంట్రాక్ట్, పార్ట్ టైమ్ అధ్యాపకులు మంగళవారం తరగతులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చేకూరి రవికుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ విశ్వవిద్యాలయాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకులను క్రమబద్ధీకరించకుండా నేరుగా అధ్యాపక పోస్టులు భర్తీ చేయడం సరికాదన్నారు. జీఓను ఉపసంహరించుకునే వరకు దశల వారి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గోపి, పేరెల్లి కోటి, శేఖర్, వీరాంజనేయులు, జి.రమ, వి. లక్ష్మీహరిత, వీరన్న, రాజీవ్ రాజ్, చలపతిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

- మిస్ వరల్డ్ పోటీలు వద్దు..

ఖమ్మం మామిళ్లగూడెం: స్త్రీల ఆత్మగౌరవాన్ని భంగం కల్గించే మిస్ వరల్డ్ పోటీలను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.శిరోమణి, ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు పోటు కళావతి, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వి.వెంకటేష్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం ఐద్వా జిల్లా అధ్యక్షురాలు రమణ అధ్యక్షతన జరిగిన ఖమ్మం రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో మహిళ, విద్యార్థి, యువజన సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్‌లో మే 7 నుంచి 31 వరకు జరిగే ఈ పోటీలు మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయటమేనన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి ఝాన్సీ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లలిత, మంగతాయి, సహాయ కార్యదర్శి శోభ, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు తాటి నిర్మల, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, పీవైఎల్ ఖమ్మం నగర కార్యదర్శి ఎం.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

- పోస్టర్లు ఆవిష్కరణ..

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 13న వైరా పట్టణంలో జరిగే ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) ఖమ్మం జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని మంగళవారం ఖమ్మం ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన పొట్టి శ్రీరాములు రోడ్‌లో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్లపల్లి ఉపేందర్ మాట్లాడుతూ..మోదీ ప్రభుత్వం తీసుకొస్తున్న మోటార్ చట్టం బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సంఘ నగర అధ్యక్షుడు ములకలపల్లి లక్ష్మీనారాయణ, అక్కినాగరాజు, నాగన్న, సాదిని ఎల్లయ్య, విజయ్, రాము, చింటూ, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

నేలకొండపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు వీరెల్లి లక్ష్మయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు సుదర్శన్, రవికుమార్, అనంతు ఉపేందర్‌గౌడ్, మన్నె రాధాకృష్ణ, సూరేపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మోహినుద్దీన్, నున్నా వెంకయ్య, వెంకటరమణ, హర్ష, గోవిందరావు, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

- గడ్డివామి దగ్ధం

కూసుమంచి: మండలంలోని చేగొమ్మలో సోమవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో 300 గడ్డిమోపులు కాలిపోయాయి. గ్రామానికి చెందిన రైతు రామాచారి గడ్డి నిలువ చేసుకోగా అర్ధరాత్రి సమయంలో మంటలు మొదలయ్యాయి. దీంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే రూ.లక్ష విలువైన గడ్డి కాలిపోయిందని బాధిత రైతు తెలిపారు.

- కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్ఎస్ఎస్, బీజేపీల ఫాసిస్ట్ మతోన్మాద విధానాలను అరికట్టాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేట్టారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సీ.వై.పుల్లయ్య, జి.రామయ్య, ఆవుల అశోక్, కె.అర్జున్‌రావు, వెంకయ్య, ఎ.వెంకన్న, నాగేశ్వరరావు, బి.లాజర్, హనుమంతరావు, లాల్మియా, కె.శ్రీనివాస్, సీహెచ్.శిరోమణి, టి.ఝాన్సీ, ఆవుల మంగతాయి, ఎన్.ఆజాద్, పి.శోభ, కుర్ర వెంకన్న, రెంటాల యాదగిరి, వి.వెంకటేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

- మాజీ ఎమ్మెల్యే నివాళి

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన సోలిపురం వెంకటరెడ్డి గుండెపోటుతో మృతిచెందగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుమారులు సురేందర్‌రెడ్డి, జయచంద్రారెడ్డిని పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు.

విజయవంతం చేయండి

రఘునాథపాలెం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ''జై బాపు – జై భీమ్ – జై సంవిధాన్''కార్యక్రమాలపై నిర్వహించే సమావేశాలను విజయవంతం చేయాలని ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతురావు, ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం రఘునాథపాలెంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 12న కోయచిలక, రేగులచిలక, కోటపాడు, చిమ్మపూడి గ్రామాల్లో మొదలయ్యే ఈ కార్యక్రమం రోజుకు కొన్ని గ్రామాల చొప్పున జరుగుతూ మే 3న రఘునాథపాలెం సభతో ముగిస్తుందని మండల కన్వీనర్ దీపక్ తెలిపారు. రఘునాథపాలెం సీఏసీఎస్ చైర్మన్ తాత రఘురాం, దీప్లానాయక్, బాలాజీ, పూర్ణ, ధరావత్ రామ్మూర్తి, రెంటాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ఖమ్మంవైద్యవిభాగం: నగరంలోని శ్రీనిధి ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన జనరల్ మెడిసిన్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు ఆస్పత్రి మేనేజ్‌మెంట్ భీమిరెడ్డి బాబురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 7 నుంచి 12 వరకు తక్కువ ఖర్చుతో నిర్వహించే ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 77991 12114, 77991 14115 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సమస్యలతో సహవాసం..

కూసుమంచిలో సౌకర్యాలు కరువు

- బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల ఇక్కట్లు
- పారిశుద్ధ్యం అంతంత మాత్రమే
- సంత రోజున ట్రాఫిక్ కష్టాలు

కూసుమంచి: పాలేరు నియోజకవర్గ కేంద్రమైన కూసుమంచి మండల కేంద్రం దినదినాభివృద్ధి చెందుతున్నా.. అదే రీతిన సమస్యలు కూడా పెరిగిపోతున్నాయి. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుడగా.. సమస్యల పరిష్కారంపై పాలకులు దృష్టి సారించడం లేదు. ప్రత్యేకాధికారుల పాలన కావడం, అరకొర నిధులు రావడంతో సమస్యలు తిష్ట వేస్తున్నాయి. పేరుకే పెద్ద గ్రామ పంచాయతీ, వ్యాపార అభివృద్ధి జరుగుతున్నా.. ప్రజలకు సరైన మౌలిక వసతులు అందడం లేదు.

సంతతో ట్రాఫిక్ చింత..

మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే కూరగాయల సంతకు సరైన స్థలం లేక పోచారం రహదారి వెంబడి నిర్వహిస్తున్నారు. దీంతో సంత రోజున ఈ రోడ్డులో కనీసం నడిచే పరిస్థితి కూడా ఉండదు. ఇక వాహనాలు ఎదురైతే వాటిని తప్పించాలంటే నరకయాతనే. ఇదే దారిలో ట్రాక్టర్లు, బడి బస్సులు, లారీలు, పశువులు రాకపోకలు సాగిస్తుండగా.. సంతకు వచ్చే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇకనైనా పాలకులు దృష్టి సారించి మండల కేంద్రంలో సమస్యలు తీర్చాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేవు..



మా డబుల్ బెడ్రూమ్‌కాలనీకి సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేవు. వానాకాలంలో కాలనీ బురదమయంగా మారి కనీసం నడిచే పరిస్థితి ఉండదు. మెయిన్ రోడ్డు నుండి కాలనీకి వచ్చే దారి సక్రమంగా లేదు. అధికారులకు విన్నవించినా పరిష్కరించడంలేదు.

– వేముల నవీన్‌కుమార్, డబుల్ బెడ్రూమ్ కాలనీ

సమస్యలు లేకుండా చూస్తాం..



కూసుమంచి, డబుల్ బెడ్రూమ్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుస్తాం. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాం. సంత రోజు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యామ్నాయ మార్గాలు చూస్తున్నాం.

– వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ

రహదారులు లేక..

కూసుమంచిలో సీసీ రహదారులు లేని బజార్లు చాలానే ఉన్నాయి. ఇటీవల కొన్ని రహదారులు మంజూరైన సమస్య మాత్రం పూర్తిగా తీరడం లేదు. ప్రధానంగా డబుల్ బెడ్రూమ్ కాలనీకి వెళ్లే దారికి సీసీ రహదారి లేకపోవడంతో వర్షాకాలం బురదమయంగా మారి నర(డ)కయాతన అనుభవించాల్సి వస్తుంది.



డబుల్‌బెడ్రూమ్ కాలనీకి వెళ్లే దారి

ప్రయాణికుల పాట్లు..



ఎండలో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

కూసుమంచిలో బస్‌షెల్టర్ లేకపోవడంతో ఎండా, వానకి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడి నుంచి ఖమ్మం, సూర్యాపేట తదితర ప్రాంతాలకు ప్రయాణం సాగించేవారికి కనీసం నీడనిచ్చే చెట్టు కూడా లేకపోవడంతో ఎండకు అల్లాడిపోతున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యాన టాయ్‌లెట్లు నిర్మించినా వాటి నిర్వహణను పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

దోమల స్వైరవిహారం..

మెయిన్ సెంటర్‌తో పాటు గ్రామంలో నిర్మించిన డ్రెయినేజీలను శుభ్రపర్చకపోవడంతో మురుగు బయటకు వెళ్లే దారి లేక దుర్వాసనతో పాటు దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పలు వ్యర్థాలు, చెత్త లాంటివి అందులో చేరి మూసుకుపోతున్నాయి. ఇక బస్టాండ్ సెంటర్‌లో దోమలతో ప్రజలు రాత్రివేళ కనీసం నిలబడే పరిస్థితి లేదు. ఇదిలా ఉండగా.. మండల కేంద్రంలో కోతులు, కుక్కల బెడద పీడిస్తోంది. కోతులతో తట్టుకునే పరిస్థితి లేదంటూ పలువురు వాపోతున్నారు.



డ్రెయినేజీల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు